క్లుప్తంగా

ఎంపీని కలిసిన నాయకులు



ఎంపీ డీకే అరుణను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఎంపీ డీకే అరుణను మంగళవారం పట్టణ బీజేపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్‌లోని ఎంపీ కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు వంశీకృష్ణ, గిరిజన మోర్చా నాయకుడు వినోద్‌నాయక్ ఉన్నారు.

కోరం లేక ఎన్నిక వాయిదా

కేశంపేట: మండల మహిళా సమాఖ్య నూతన మండల కమిటీ ఎన్నిక కోరం లేకపోవడంతో వాయిదా పడినట్టు ఏపీఎం భగవంతు తెలిపారు. మండలంలో 29 గ్రామాల పరిధిలో 39 గ్రామ సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో గ్రామ సంఘం అధ్యక్షులకు ఓటు హక్కు ఉంటుందని, మంగళవారం నిర్వహించిన సమావేశంలో 19 మంది మాత్రమే హాజరైనట్టు ఆయన తెలిపారు. వచ్చే నెలలో మళ్లీ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకుంటామని స్పష్టం చేశారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులతో దాత సచిన్, ఉపాధ్యాయులు

కేశంపేట: మండల పరిధిలోని దేవునిగుడి తండాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన సచిన్ నోట్‌బుక్స్, స్టేషనరీ అందించాడు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువుల్లో రాణించాలని సూచించాడు. చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సిద్ధు, తరుణ్, జగన్, శివ, రాకేశ్, హన్మంత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన స్లాబ్ పనులు ప్రారంభం



స్లాబ్ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాల

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవన స్లాబ్ పనులను జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో లైబ్రరీల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు రాణి, కృష్ణారెడ్డి, శంకరయ్య, కుమ్మరి శ్రీను, బాలరాజ్, అంజయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అధికారులు

మంచాల: నిరుపేద కుటుంబంలో పుట్టి పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న డాక్టర్ ఎస్.కె.భిక్షపతిని ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీఓ బాలశంకర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన 25 మంది విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. తాళ్లపల్లిగూడకు చెందిన భిక్షపతి పేద విద్యార్థులకు చేయూత ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులను శాలువాతో సన్మానించి కాలిక్యులేటర్, నోట్‌బుక్స్, ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికను అందజేశారు. పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన చెన్నారెడ్డిగూడ, మంచాల బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో భిక్షపతి, ఎంఈఓ రాందాస్, ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

- రైతు భరోసా సంబురాల్లో నాయకులు, వ్యవసాయాధికారులు, రైతులు
- సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం



షాద్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

షాద్‌నగర్: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల రైతు వేదిక వద్ద మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు రైతులు, నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నగరంలో నిర్వహిస్తున్న రైతు భరోసా సంబురాల ప్రత్యక్ష ప్రసారాన్ని నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేస్తున్నారన్నారు. రైతును రాజును చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ నిషాంత్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారిణి హిమబిందు, ఏఈఓ గోవర్దన్, మార్కెట్ కమిటీ డైరక్టర్లు సురేష్, వెంకట్‌రెడ్డి, కార్యదర్శి యాదయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే లక్ష్యం

రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, టీపీసీసీ కార్యదర్శి ఎన్.రాంరెడ్డితో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి రైతు వేదిక వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం రైతు భరోసా సంబురాల ప్రత్యక్ష ప్రసారాన్ని నాయకులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, తహసీల్దార్ ఎండీ అన్వర్, ఎంపీడీఓ అపర్ణ, ఏఓ వెంకటేశం, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో..

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో రైతన్నలు సంబురాలు జరుపుకున్నారు. రైతు భరోసా డబ్బులు జమకావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మండలంలో 11,552 మంది రైతుల ఖాతాల్లో 13 కోట్ల రూపాయలు జమైనట్లు ఏఓ రాజేందర్‌రెడ్డి తెలిపారు. కొందుర్గు మండలంలో 11,032 మందికి రూ.12.76 కోట్లు జమైనట్లు ఏఓ సురేష్‌రెడ్డి తెలిపారు.

రైతు సంక్షేమానికి కృషి

కేశంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తోందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం రైతు భరోసా సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు భరోసా సంబురాల ప్రత్యక్ష ప్రసారాన్ని నాయకులతో కలిసి వీక్షించారు. అదేవిధంగా అల్వాలలో నిర్వహించిన సంబురాల్లో నాయకులు, రైతులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు గూడ వీరేష్, ఏఎంసీ డైరెక్టర్ కరుణాకర్, శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, అనంద్‌కుమార్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: అల్వాలలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న నాయకులు, రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు



షాబాద్: మాచన్‌పల్లి రైతు వేదిక వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపట్టానికి క్షీరాభిషేకం

సకాలంలో పెట్టుబడి సాయం

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందించి ఆదుకుంటుందని ఆర్డీఓ చంద్రకళ, ఏడీఏ సురేశ్‌బాబు అన్నారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి నగరంలో నిర్వహించిన రైతుభరోసా విజయోత్సవ సంబురాలను మండలంలోని చేవెళ్ల, ఆలూరు, ఖానాపూర్ రైతు వేదికల్లో అధికారులు, నాయ కులు, రైతులు వీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఏఓ రాజశేఖర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



చేవెళ్ల రైతు వేదికలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న ఆర్డీఓ చంద్రకళ, రైతులు, నాయకులు

సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

షాద్‌నగర్: సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం పట్టణ వాసవి క్లబ్ అధ్యక్షుడు కల్వ మాణిక్యం, వనితా క్లబ్ అధ్యక్షురాలు కల్వ మధుప్రియ ఆధ్వర్యంలో డాన్ టు డెస్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేశ్వర్‌రావు హాజరై మాట్లాడుతూ.. సమాజానికి, పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో వాసవి, వనితా క్లబ్ ముందుకు సాగుతోందన్నారు. షాద్‌నగర్ క్లబ్ వారు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో విశ్రాంత సైనికులను సన్మానించి, రెండు వేల లీటర్ల వాటర్ ట్యాంకును బహూకరించారు. అదేవిధంగా చెప్పులు కుట్టి జీవనోపాధి కొనసాగిస్తున్న వారికి అవసరమైన సామగ్రిని అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో క్లబ్ సభ్యులు వినయ సంతోష, అర్థం లక్ష్మీనారాయణ, నవీన్‌కుమార్, స్రవంతి, సురేష్‌కుమార్, స్వప్న, వెంకటరమణ, కొండా రమ, దొంతు పాండురంగయ్య, నర్సింహగుప్తా, బాలరాజేశ్, నవీన్‌కుమార్, పెద్ది రామ్మోహన్, బండారి ఆనంద్, దండు రామ్మోహన్, దండు శ్రీనివాసులు, త్రినాథ్‌కుమార్, రూపాదేవి, ఎంఈఓ మనోహర్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

ముదిరాజ్ సంఘం తాలుకా అధ్యక్షుడు వెంకటేశ్



దస్తావేజు లేఖరులను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం తాలుకా అధ్యక్షుడు మంగ వెంకటేశ్ అన్నారు. దస్తావేజు లేఖరుల సంఘం ఉపాధ్యక్షులుగా ఎన్నికైన గడ్డమీది శ్రీహరి ముదిరాజ్, శానమోని రవికుమార్ ముదిరాజ్‌ను మంగళవారం పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో ఆ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ముదిరాజ్‌లు రాణించాలని సూచించారు. అదేవిధంగా విద్యా, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో ముదిరాజ్‌లు ప్రతిభను కనబర్చాలన్నారు. ముదిరాజ్‌లందరూ ఐక్యంగా ముందుకు సాగితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జంగయ్య, పైలయ్య, శ్రీధర్ వర్మ, అశోక్, యాదయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాబాద్: మండల పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 1995-96 7వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు నాగర్‌కుంట పరిధిలోని గ్రీన్‌జోన్ గార్డెన్‌లో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రామయ్య, రాజిరెడ్డి, స్వరూప, అరుంధతిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాములు, శారద, మల్లేశ్, నర్సింలు, రాధిక, జగన్‌మోహన్‌రెడ్డి, రాంచంద్రయ్య తదితరులు ఉన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ నాయకుడు ఆదిల్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ నాయకుడు ఆదిల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని క్రిష్టియన్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో చదువుకునే విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలకు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులే వస్తారని, వారికి నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వారికి కావాల్సిన మౌలిక వసతులను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, జాఫర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన అవసరం

ఎస్ఐ పద్మ



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు

శంకర్‌పల్లి: మత్తు పదార్థాల వాడకంతో జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన అవసరమని మోకిల ఎస్ఐ పద్మ అన్నారు. మండలంలోని కొండకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా విద్యార్థులకు డ్రగ్స్‌కు అలవాటు పడితే జరిగే అనర్థాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు అలవాటు పడితే కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వాలు డ్రగ్స్ నివారణకు ఎన్నో చర్యలు తీసుకుంటున్నా కూడా వాడకం కొనసాగుతూనే ఉందన్నారు. డ్రగ్స్ నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం జీవనజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

బోనాలను విజయవంతం చేయండి

కుమ్మరి సంఘం డివిజన్ అధ్యక్షుడు నడికూడ శ్రీశైలం



బోనాల ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: హైదరాబాద్‌ని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద గల శ్రీ కనకాల కట్టమైసమ్మ అమ్మవారికి ఈ నెల 6న నిర్వహించనున్న తొలి బోనం ఉత్సవాలను విజయవంతం చేయాలి ని కుమ్మరి సంఘం డివిజన్ అధ్యక్షుడు నడికూడ శ్రీశైలం అన్నారు. మంగళవారం పట్టణంలోని కుమ్మరి సంఘం కార్యాలయం వద్ద సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రాయికల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారి బోనాల ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాల్లో భాగంగా శ్రీ కనకాల కట్టమైసమ్మ దేవతకు తొలిబోనం సమర్పిస్తామన్నారు. కుమ్మరుల ఆధ్వర్యంలో 501 బోనాలతో ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. మట్టి కుండలో సమర్పించే బోనం అమ్మవారికి ఎంతో శ్రేష్టమన్నారు. నియోజకవర్గం నుంచి కుమ్మరులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం నాయకులు రమేశ్, అంజయ్య, సాయిలు, యాదయ్య, శేఖర్, రమేశ్, వెంకటేశ్, జంగయ్య, రాజు, వెంకటేశ్, శ్రీను, కృష్ణ, శ్రీను, శేఖర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు 'తల్లికి వందనం' పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సకాలంలో వర్షాలు కురవాలంటే అడవుల శాతం పెంచాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శర్వలింగం, కృష్ణమోహన్, చంద్రశేఖర్‌రెడ్డి, జయసింహ, భార్గవ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఐక్యతతో హక్కులను సాధించుకుందాం

బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జలజ



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న జలజ

షాద్‌నగర్‌రూరల్: కులాలకతీతంగా బీసీలు ఐకమత్యంతో కలిసికట్టుగా ఉద్యమించి రిజర్వేషన్ సాధించుకుందామని బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలో మంగళవారం ఆమె ఆధ్వర్యంలో మహిళా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీసీలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయన్నారు. గెలిచిన తర్వాత వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీసీలు రాజకీయ చైతన్యంతో ముందుకు సాగినప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. రాజకీయ పార్టీల నాయకుల నిర్లక్ష్యం, పాలకుల పక్షపాత వైఖరితో బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి పోతున్నారన్నారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారం కోసం బీసీలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం బీసీసేన నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షురాలిగా శోభ, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మమ్మ, ప్రధాన కార్యదర్శిగా గుండ్రాతి లావణ్య, కార్యదర్శిగా గడ్డమీది లావణ్య, సహాయ కార్యదర్శిగా దేవగిరి విజయను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లేడ్‌చౌదరిగూడ మండల బీసీసేన మహిళా అధ్యక్షురాలు జయశ్రీకాంత్, పట్టణ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఫరూఖ్‌నగర్ మండల ఉపాధ్యక్షురాలు స్రవంతీరాజ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా సంబురాలకు ఆహ్వానం ఇవ్వరా?

మోకిల రైతు వేదిక వద్ద రైతుల నిలదీత



రైతులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, వ్యవసాయాధికారులు

శంకర్‌పల్లి: ప్రభుత్వం రైతుభరోసా సంబురాలను రైతులతో ఘనంగా నిర్వహించాలని ఆదేశించిన అధికారులు.. రైతులకు సమాచారం ఇవ్వకుండా ఎలా నిర్వహిస్తారని మోకిల రైతు వేదిక వద్ద రైతులు వ్యవసాధియాకారులను నిలదీశారు. మంగళవారం రైతు వేదికల వద్ద నిర్వహించిన రైతు భరోసా సంబురాల గురించి రైతులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని పలువురు రైతులు, నాయకులు మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి కవిత, ఏఈఓ రామకృష్ణారెడ్డిని ప్రశ్నించారు. దీంతో రైతు వేదిక వద్ద రసభసాగా మారింది. ముందుగానే గ్రామాల్లో డప్పు చాటింపు వేయించి రైతులకు సమాచారం ఇచ్చి రైతులను తీసుకురావాల్సింది పోయి ఎలాంటి సమాచారం లేకుండా కొంత మందికే చెప్పటం ఏమిటని ప్రశ్నించారు. దీంతో ఎంపీడీఓ వెంకటయ్యగౌడ్ కల్పించుకొని రైతులు, నాయకులతో మాట్లాడి మరోసారి ఇలాంటివి జరగకుండా చూసుకుంటామని నచ్చజెప్పారు. అనంతరం రైతు వేదికలో రైతు భరోసా సంబురాల వీడియో కాన్ఫరెన్స్ కొనసాగింది.

రైతుభరోసా మాకెందుకు రాలేదో చూడండి

వ్యవసాయ విస్తరణ అధికారిని చుట్టుముట్టిన రైతులు



రైతు భరోసా గురించి ఏఈఓను అడుగుతున్న రైతులు

మొయినాబాద్: రైతుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు జమ చేశామంటూ ప్రభుత్వం ఓ వైపు సంబురాలు జరుపుతుంటే, మరోవైపు కొంతమంది రైతులు మాకెందుకు రైతు భరోసా రాలేదో చూడమంటూ ఏఈఓను చుట్టుముట్టారు. మొయినాబాద్ రైతు వేదిక వద్ద మంగళవారం సాయంత్రం రైతుభరోసా వియోజత్సవ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కార్యక్రమానికి వచ్చిన చాలా మంది రైతులు తమకు రైతుభరోసా డబ్బులు ఖాతాలో పడినట్లు మెసేజ్ రాలేదని, ఎందుకు రాలేదో ఆన్‌లైన్‌లో చూడాలని ఏఈఓ సునీల్‌ను కోరారు. ఏఈఓ రైతుల పాస్‌బుక్ నంబర్ ద్వారా ఆన్‌లైన్‌లో చెక్ చేశారు. కొంతమంది రైతులకు రైతుభరోసా ప్రాసెసింగ్‌లో ఉందని.. మరికొంత మందికి పంటలు సాగు చేయకపోవడంతో రాలేదని.. సాగుచేసిన పంటల వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ రైతులకు సూచించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



జాపాలలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

మంచాల: మండలంలోని జాపాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లింగమయ్యగౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఆకర్శితులై పార్టీలో చేరామని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో నోముల ప్రవీణ్, నగేష్‌యాదవ్, మంతని నరేష్ యాదవ్ ఉన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేష్, నాయకులు మహేష్‌గౌడ్, శేఖర్, రవి, లింగం, పరమేష్‌యాదవ్, సుమన్, సతీష్ పాల్గొన్నారు.